# ఫలితాలకు నిరీక్షణ !

- వెల్లడికాని భూసార పరీక్షల రిజల్ట్స్
- తుని సబ్ డివిజన్‌లో 3940 నమూనాల సేకరణ
- మెట్టలో ముమ్మరంగా ఖరీఫ్ పనులు
- పరీక్షల ఫలితాల కోసం అన్నదాతల ఎదురుచూపులు



తుని మండలంలో సేకరించిన మట్టి నమూనాలు



తునిలో నిర్మాణం పూర్తికాని ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్

**తుని రూరల్:** సాగు భూముల్లో సూక్ష్మపోషక లోపాలను గుర్తించి రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు ఇచ్చేందుకు చేపట్టిన భూసార పరీక్షల ఫలితాలు ఇంకెప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. తుని వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో వేల సంఖ్యలో సేకరించిన మట్టి నమూనాల పరీక్ష ఫలితాలు నేటికి వెల్లడికాలేదు. దీంతో భూసారం ఏవిధంగా ఉందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. ఫలితాలు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితుల్లో సూక్ష్మ పోషక లోపాలను పక్కనపెట్టి మెట్ట రైతులు ఖరీఫ్ పనులు కొనసాగిస్తున్నారు. ఆలస్యంగా మొదలు పెట్టినప్పటికీ 20 శాతానికి పైగా ఖరీఫ్ పనులను సాగుదారులు పూర్తి చేశారు. ఈ నెల మూడో వారానికి వందశాతం ఖరీఫ్ నాట్లు పూర్తికానున్నట్టు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. సబ్‌డివిజన్ పరిధిలో తుని, కోటనదూరు, తొండంగి, శంఖవరం, రౌతులపూడి మండలాల్లో ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 17,069 హెక్టార్లు ఉంది. జూన్ నెల మొదట వారంలో పది హెక్టార్లకు ఒకటి చొప్పున 3940 మట్టి నమూనాలు సేకరించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో పూర్వం ఏర్పాటైన భూసార పరీక్షా కేంద్రం మూసివేశారు. తునిలో రూ.40 లక్షలతో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్ నిర్మాణ పనులు చివరి దశలో నిలిచిపోయాయి. దీంతో సబ్‌డివిజన్‌లో సేకరించిన మట్టి నమూనాలను సామర్లకోట భూసార పరీక్షా కేంద్రానికి తరలించారు. మట్టి పరీక్షలు పూర్తికాకపోవడంతో ఫలితాలు వెల్లడికాలేదు.

**మండలాల వారీగా సాగు విస్తీర్ణం, సేకరించిన మట్టి నమూనాలు**

| మండలం | సాధారణ సాగు విస్తీర్ణం (హెక్టార్లలో) | సేకరించిన మట్టి నమూనాలు (హెక్టార్లలో) |
|---|---|---|
| తుని | 3420 | 1000 |
| కోటనందూరు | 4065 | 640 |
| తొండంగి | 5450 | 900 |
| శంఖవరం | 1502 | 680 |
| రౌతులపూడి | 2632 | 720 |
| మొత్తం | 17,069 | 3940 |

**ప్రయోజనాలు**

ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి భూసార పరీక్షలు చేయించడం వల్ల భూమి పొరల్లో లోపాలు తెలుస్తాయి. ఆమ్ల, క్షార సూచిక లవణాల స్థాయి, సేంద్రియ కర్బనం, భాస్వరం, పొటాషియం తదితరాలు ఏ నిష్పత్తుల్లో ఉన్నాయో తెలుస్తుంది. లోపాలను బట్టి దుక్కులు, దమ్ముల్లో తగిన మోతాదులో సూక్ష్మ పోషకాలను వేసి కలియదున్నడంతో భూసారం పెరుగుతుంది. ఆమ్లగుణం ఉన్న నేలల్లో సున్నంతో, క్షారగుణం ఉన్న నేలల్లో జిప్సంతో భూములను బాగు చేసుకోవచ్చు. ఫలితంగా ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గడంతో పాటు నాణ్యతగల అధిక దిగుబడులు సాధించేందుకు ఉపయోగపడుతుంది.

### మూడో వంతు భూముల్లో మట్టి పరీక్షలు



ప్రతి సంవత్సరం మూడో వంతు సాగు భూముల్లో మట్టి నమూనాలు సేకరించి పరీక్షిస్తాం. పరీక్షా ఫలితాలు మూడేళ్ల వరకు ఉపయోగపడతాయి. భూ పరీక్షలు ఆధారంగా సూక్ష్మ పోషకాలు వేసుకుని నేలలను ఆరోగ్యవంతంగా మలుచుకోవాలి. ప్రతి సంవత్సరం సేంద్రియ ఎరువులు వాడాలి. వాతావరణ పరిస్థితులు ఆధారంగా యూరియాను తగ్గించాలి. 15 రోజులకు ఒకసారి చొప్పున మోతాదును రెండు సార్లు వేయాలి. పొటాష్ ఎకరానికి 15 కిలోలు వేయడం మంచిది. అందుబాటులో ఉండే మండల ఏఓలు, వీఏఏలను సంప్రదించి తగిన సలహాలు, సూచనలు పాటించాలి.

– సుంకర బుల్లిబాబు, ఏడీఏ, తుని

# వాన జోరు... అన్నదాత బేజారు

- పలు గ్రామాల్లో నీట మునిగిన పంట పొలాలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



పాలెంలో నీట మునిగిన పంట పొలాలను పరిశీలిస్తున్న ఏఓ అమృత



కొత్తయర్రవరంలో నీటమునిగిన వరిపొలం

**ఏలేశ్వరం:** కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. విస్తారంగా వర్షాలు పడుతుండడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులపై నీరు నిలిచిపోయింది. పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. ప్రస్తుతం ఖరీఫ్ పనులు ముమ్మరంగా జరుగుతుండగా పల్లపు ప్రాంతంలో ఉన్న పొలాలు నీట మునిగాయి. మండలంలోని యర్రవరం, కొత్తయర్రవరం, సిరిపురం, పేరవరం తదితర గ్రామాల్లో నాట్లతో ఉన్న పొలాలు నీటమునగడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాల్లోని రహదారులు ముంపులోనే ఉన్నాయి.

**నీట మునిగిన వరి పంటలు**

**కిర్లంపూడి:** అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పాలెం, బూరుగుపూడి, సోమరాయణంపేట గ్రామాల్లో సుమారు 230 ఎకరాలు వరి పంట నీట మునిగింది. బూరుగుపూడిలోని దుస్లం చెరువు, పుష్కరు కాలువ ద్వారా వచ్చిన వరద నీరు పంట పొలాలను ముంచెత్తింది. నాట్లు వేశాక ఇప్పటికే రెండు సార్లు పొలాలు నీట మునగడంతో వరి చేలు కుళ్లిపోయాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరద నీటి ముంపుతో పంటలు నష్టపోయామని ఆవేదన చెందుతున్నారు. ఆయా గ్రామాల్లో ముంపునకు గురైన పంట పొలాలను గురువారం ఏఓ జోకా అమృత పరిశీలించారు. పంట నష్టాన్ని అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నేతలు అడబాల కొండబాబు, పెనగంటి బాబ్జి, రాపేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**70 ఎకరాల్లో నీట మునిగిన వరి పంట**

**జగ్గంపేట:** రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలో 70 ఎకరాల్లో వరి పంట నీట మునిగిందని వ్యవసాయాధికారి రెడ్ల శ్రీరామ్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. నీట మునిగిన వరి పంటలను పరిశీలించారు. మండలలోని గొల్లలగుంట, రామవరం గ్రామాల్లో వరిపంట ఎక్కువగా నీట మునిగిందని చెప్పారు. రైతులు సస్య రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.



జగ్గంపేట మండలంలో నీట మునిగిన వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ శ్రీరామ్

### తెరిపినిచ్చిన వాతావరణం

**తొండంగి:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షం గురువారం కాస్త తెరిపిచ్చింది. అధిక వర్షాల కారణంగా ఇప్పటికే ప్రాజెక్టులు, చెరువులు జలకళను సంతరించుకున్నాయి. పలు గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షాల కారణంగా చిరువ్యాపారులు, భవన నిర్మాణ కార్మికులు పనుల్లేక ఆర్థిక ఇబ్బందులు పడ్డారు. ఇటుకల బట్టీలు, తాండ్ర పరిశ్రమలు తాత్కాలికంగా మూతపడ్డాయి. వాతావరణం తెరిపివ్వడంతో వివిధ వర్గాల ప్రజలు తమ కార్యకలాపాలు నిర్వహించుకున్నారు. వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచించారు.

# ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నికలు



లంపకలోవ ఎంపీపీ పాఠశాలకు ఎన్నికైన మహిళా ఎస్ఎంసీ సభ్యులు

**ఏలేశ్వరం:** ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. నియోజకవర్గంలో 170 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా వాటిలో ప్రాథమిక పాఠశాలలు 121, ప్రాథమికోన్నత పాఠశాలలు 18, ఉన్నత పాఠశాలలు 31 ఉన్నాయి. కాగా వాటిలో దాదాపుగా ఎన్నికలన్నీ ఏకగ్రీవంగా జరిగాయి. నూతన చైర్మన్, వైస్ చైర్మన్లు, ఇతర కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కార్యవర్గాలకు స్థానిక నాయకులు అభినందనలు తెలిపారు.

**46 పాఠశాలల్లో..**

**రౌతులపూడి:** మండలంలోని 33 ప్రాథమిక, ఏడు ప్రాథమికోన్నత, ఐదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల వెరసి మొత్తం 46 పాఠశాలల్లో గురువారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని పల్లపు చామవరం ప్రాథమిక పాఠశాలలో ఎన్నిక అనివార్యమైంది. మిగిలిన 45 పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఎన్నికలు అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్లు, ఇతర కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

**కిర్లంపూడి:** మండలంలోని 41 ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాతంగా జరిగాయి. పలు పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవమైనట్టు ఎంఈఓలు టీ.జోసెఫ్, మక్కా చిన్నారావు తెలిపారు.

**తుని మండలంలో...**

**తుని రూరల్:** మండలంలో పాఠశాలల యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని ఎంఈఓ పరవాడ గీతాదేవి గురువారం తెలిపారు. మండలంలో 91 మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపల్, ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయన్నారు. మొత్తం పాఠశాలల్లో కమిటీ సభ్యులతో పాటు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్టు ఆమె వివరించారు. డి.పోలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నిక ఏకగ్రీవమైనట్టు హెచ్ఎం వీఎస్ఆర్ మూర్తి తెలిపారు. చైర్మన్‌గా బర్ల గోవిందు, వైస్ చైర్మన్‌గా ఆసినా లోవలక్ష్మి ఎన్నికవడంతో హెచ్ఎం, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

**కోటనందూరు:** మండలంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. ఆరు జెడ్పీ హైస్కూళ్లు, నాలుగు ప్రాథమికోన్నత, 21 ప్రైమరీ, కేజీబీవీ స్కూళ్లలో కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులతో ఆయా పాఠశాలల హెచ్ఎంలు ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కమిటీ సభ్యులను సత్కరించి అనుసరించాల్సిన విధివిధానాలు వివరించారు. ఎన్నికలను ఎంఈఓలు శ్రీనివాస్, రామశేఖర్ పర్యవేక్షించారు.

**53 పాఠశాలల్లో ఎన్నికలు**

**గోకవరం:** మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. మండలంలో 53 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఎక్కువ పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవం కాగా కొన్ని పాఠశాలల్లో ఓటింగ్ ద్వారా కమిటీని ఎన్నుకున్నారు. భూపతిపాలెం గురుకుల పాఠశాల ఎస్ఎంసీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. కమిటీ చైర్మన్‌గా గళ్లా రాము ఎన్నికయ్యారు. నూతన కమిటీకి పలువురు అభినందనలు తెలిపారు.

**గండేపల్లి:** మండలంలోని 41 ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగినట్టు ఎంఈఓ కేహెచ్ నాయక్ తెలిపారు. 30 ప్రాథమిక పాఠశాలలు, ఐదు ప్రాథమికోన్నత, ఆరు ఉన్నత పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయని వివరించారు.

**ఎస్ఎంసీలో అందరూ మహిళలే**

**ప్రత్తిపాడు:** మండలంలోని లంపకలోవ ఎంపీపీ పాఠశాల యాజమాన్య కమిటీకి గురువారం జరిగిన ఎన్నికల్లో అందరూ మహిళా సభ్యులే ఎన్నికయ్యారు. ఎస్ఎంసీ కమిటీలో సభ్యులంతా మహిళలే ఉండాలని విద్యార్థుల తల్లిదండ్రులు నిర్ణయించారు. ఈ మేరకు పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్‌గా ముప్పల గంగాభవాని, వైస్ చైర్‌పర్సన్‌గా కుక్కల దుర్గాభవానితో పాటు మరో 13 మంది సభ్యులు కూడా మహిళలే ఎన్నికయ్యారు.

**జగ్గంపేట:** మండలంలోని 47 ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని మండల విద్యాశాఖాధికారి ఆర్.స్వామి గురువారం తెలిపారు. 41 పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవం కాగా ఆరు స్కూళ్లలో చేతులెత్తే విధానంలో ఎన్నికలు జరిగాయని చెప్పారు.

**పాఠశాలల అభివృద్ధికి పాటుపడాలి**

**ప్రత్తిపాడు:** ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి పాఠశాల యాజమాన్య కమిటీలు దోహదపడాలని సర్వశిక్ష జిల్లా కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి (సీఎంఓ) చామంతి నాగేశ్వరరావు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఎస్ఎంసీ ఎన్నికలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికైన ఎస్ఎంసీ సభ్యులు పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని సూచించారు. కాగా ప్రత్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. చైర్మన్‌గా మాదే రాజేంద్రకుమార్, వైస్ చైర్మన్‌గా ముద్దు నాగమణి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి వి.రాజబాబు, సీఆర్పీలు రాంజీ ప్రసాద్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

**47 పాఠశాలల్లో..**

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం స్కూల్ యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని 33 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు, ఐదు ప్రాథమికోన్నత, 9 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించినట్టు మండల విద్యాశాఖాధికారి వి.రాజబాబు తెలిపారు.

## క్లుప్తంగా

### తపోవనంలో గణపతి హోమం



తపోవనంలో హోమం నిర్వహిస్తున్న పీఠాధిపతి సరస్వతీ మహాస్వామి

**తుని రూరల్:** మండలంలోని కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో గురువారం మహాగణపతి హోమం నిర్వహించారు. శ్రావణ మాసంలో చతుర్దశిని పురస్కరించుకుని పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ఆధ్వర్యంలో వేద పండితులు హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. గణపతికి పంచామృతాభిషేకాలు, గరిక పూజ చేశారు. వేదపండితులు, వేద విద్యార్థులు పాల్గొన్నారు.

### కూలిన పశువైద్యశాల ప్రహరి



ప్రత్తిపాడులో కూలిన ప్రహరిని పరిశీలిస్తున్న పశుసంవర్ధక శాఖ ఏడీ యోగేశ్వర్

**ప్రత్తిపాడు:** అల్పపీడనం ప్రభావంతో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రత్తిపాడు ప్రభుత్వ పశువైద్యశాల ప్రహరి గురువారం ఉదయం కూలిపోయింది. స్థానిక గోవిందరాజులు చెరువు గట్టు ఒడ్డున నిర్మించిన పశువైద్యశాలకు చెరువు మధ్య రహదారి మార్గాన్ని వదిలిపెట్టారు. ఈ మార్గంలో కోర్టు, సచివాలయం, రైతు భరోసా కేంద్రానికి, ఇందిరా కాలనీకి రాకపోకలు సాగిస్తారు. ఈ వైద్యశాల ప్రహరీ నిర్మించి సుమారు ఐదేళ్లు కావస్తోంది. ఎడతెరిపి లేకుండా పది రోజులుగా కురుస్తున్న వానలకు పశువైద్యశాల ప్రహరీ నానుతూ ఉండడంతో ఒక్కసారిగా కుప్పకూలింది. సుమారు 40 అడుగుల పొడవునా కూలిన గోడను జిల్లా పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ చిక్కం బాలచంద్ర యోగేశ్వర్ పరిశీలించారు. ఉదయం వేళ కావడం, జన సంచారం లేకపోవడం, వైద్యశాలలో పశువులు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.

### చట్టాలపై అవగాహన అవసరం



గోకవరంలో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై పవన్‌కుమార్

**గోకవరం:** విద్యార్థినులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని గోకవరం ఎస్సై పవన్ కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు గురువారం ఆయన బాలికలు, మహిళలు, పోలీసుల భద్రత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రతిఒక్కరూ విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సత్యదేవుని దర్శించిన రాష్ట్ర వైద్యారోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ



సత్యదేవుని సన్నిధిలో కృష్ణబాబుకు ప్రసాదాలు అందజేస్తున్న ఏఈఓ కృష్ణారావు

**అన్నవరం:** రాష్ట్ర వైద్యారోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు కటుంబ సభ్యులతో కలిసి గురువారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా స్వామివారి ప్రసాదాలను ఏఈఓ కృష్ణారావు అందజేశారు.

### గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**తొండంగి:** మండలంలోని పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ మెహర్ తెలిపారు. కామర్స్, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పీజీలో 55 శాతం(ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం) మార్కులు కలిగి ఉండాలన్నారు. పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 13వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు కళాశాల పనివేళల్లో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

### వైభవంగా ఆలయ వార్షికోత్సవం



కాకరాపల్లిలో ప్రత్యేక అలంకరణలో కనకదుర్గమ్మ

**కోటనందూరు:** మండలంలోని కాకరాపల్లిలో కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయాన్ని రంగులు, విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఉదయం వేదపండితులు అమ్మవారికి చండీ హోమం, పంచామృతాభిషేకం, కుంకుమ పూజలు నిర్వహించారు. గ్రామంతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి దుర్గమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం భారీ అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి అన్నప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### పేకాడుతున్న ఎనిమిది మంది అరెస్టు

**గోకవరం:** మండలంలోని గుమ్మళ్లదొడ్డిలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై గురువారం స్థానిక ఎస్సై పవన్‌కుమార్ తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.76,500, రెండు సెట్ల ప్లే కార్డులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రాజమహేంద్రవరం కోర్టులో హాజరుపరుస్తామని ఎస్సై తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**తుని:** విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో జగ్గంపేట ఈఈ కె.రత్నాలరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తాండవ సబ్‌స్టేషన్ పరిధిలోని కొండవారిపేట, టైలర్స్‌కాలనీ, కంకిపాటి వారి గరువు, అమ్మాజీపేట, సీతారాంపురం, బంగ్లా రోడ్డు, సాయినగర్, ఇండోర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఎల్ఐసీ కార్యాలయం, సాయినగర్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని సహకరించాలని ఆయన కోరారు.

**కిర్లంపూడి:** మండలంలోని వీరవరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమతుల కారణంగా శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో జగ్గంపేట ఏఈ కె.రత్నాలరావు గురువారం తెలిపారు. వీరవరం, తామరాడ, రామచంద్రపురం, గోనేడ, పాలెం, రామకృష్ణాపురం, ముక్కొల్లు గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

**శంఖవరం మండలంలో...**

**శంఖవరం:** స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో వార్షిక మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో జగ్గంపేట ఈఈ కె.రత్నాలరావు గురువారం తెలిపారు. శంఖవరం ఎంహెచ్‌ఓ, నెల్లిపూడి, పి.మల్లాపురం పీడర్ల పరిధిలోని నెల్లిపూడి, కొంతంగి, గొంది కొత్తపల్లి, జగ్గంపేట, వేళంగి గ్రామాలకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

### పదవులు బాధ్యతను పెంచుతాయి



రాంజీ ప్రసాద్‌ను సత్కరిస్తున్న సర్వశిక్ష సీఎంఓ నాగేశ్వరరావు, ఎంఈఓ రాజబాబు

**ప్రత్తిపాడు:** పదవులు బాధ్యతను పెంచుతాయని సర్వశిక్ష జిల్లా కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి (సీఎంఓ) చామంతి నాగేశ్వరరావు అన్నారు. స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో గురువారం సీఆర్పీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన స్థానిక సీఆర్పీ ఎలిపే రాంజీ ప్రసాద్ సత్కార సభ నిర్వహించారు. సీఎంఓ చామంతి నాగేశ్వరరావు, మండల విద్యాశాఖాధికారి వి.రాజబాబు తదితరులు రాంజీ ప్రసాద్‌ను శాలువా, పూలమాలతో సన్మానించారు. సంఘ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. . కార్యక్రమంలో సీఆర్పీలు కె.గంగారావు, అప్పన మల్లేషు, బాషా, సీఓ రామకృష్ణ, జి.శ్రీను పాల్గొన్నారు.

### మౌలిక వసతుల కల్పనకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

**గండేపల్లి:** మౌలిక వసతుల కల్పనతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ చలగళ్ల దొరబాబు అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే నెహ్రూ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గోకవరం, జగ్గంపేట మండలాలకు సుమారు రూ. 26 కోట్లు ఇప్పటికే నిధులు మంజూరు చేశామన్నారు. కిర్లంపూడి, గండేపల్లి మండలాలకు రూ.27 కోట్లు నిధులు తీసుకురానున్నట్టు తెలిపారు. గ్రామాల్లో రహదారులు, తాగునీరు, శానిటేషన్, డ్రైనేజీ వ్యవస్థపై అధికారులు దృష్టి సారించాలన్నారు. బావవరం ఫిల్టర్ బెడ్ ద్వారా గ్రామాలకు రక్షిత తాగునీరు అందించాలని అధికారులకు సూచించారు. అనంతరం పలు శాఖలకు చెందిన అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కుంచె రాజా, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మద్దిపట్ల రామకృష్ణ, గండేపల్లి సర్పంచ్ రుత్తల లలిత, జెడ్.రాగంపేట సర్పంచ్ కందుల చిట్టిబాబు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

### బాధితులకు అండగా ప్రభుత్వం

కాకినాడ ఆర్డీఓ కిషోర్



గొల్లప్రోలులో సుద్దగెడ్డ ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కాకినాడ ఆర్డీఓ కిషోర్

**పిఠాపురం:** గొల్లప్రోలు మండలంలోని వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని కాకినాడ ఆర్డీఓ ఇట్ల కిషోర్ తెలిపారు. గొల్లప్రోలు మండలంలో సుద్దగెడ్డ ముంపు ప్రాంతాన్ని నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్‌తో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొల్లప్రోలు మండలంలోని సుద్దగెడ్డ పరివాహక ప్రాంతంలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు సుద్దగెడ్డ వాగు ఉధృతంగా ప్రవహించి గొల్లప్రోలులో పలు ప్రాంతాలు నీట మునిగాయన్నారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో రక్షణ చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కాలనీవాసులకు అవసరమైన తాగునీరు తక్షణమే అందించాలని, కాలనీ అంధకారంలో ఉన్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా కాలనీ సమీపంలోని మున్సిపల్ రెవెన్యూ సిబ్బంది పరిస్థితిని పరిశీలించాలన్నారు. కాలనీవాసులు రాకపోకలు సాగించేందుకు అవసరమైన పడవలను ఏర్పాటు చేయాలని మత్స్యశాఖ సిబ్బందిని ఆదేశించారు. బాధితులకు రేషన్ పంపిణీ చేయాలని తహసీల్దార్‌కు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, ఇన్చార్జి తహసీల్దార్ మస్తానా విద్యుత్ శాఖ అధికారులు, మత్స్యశాఖ అధికారులు, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.